క్లుప్తంగా

యోగయ్య మఠం నిర్మాణానికి శంకుస్థాపన



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కురిచేడు: స్థానిక శ్రీ యోగి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి (యోగయ్య) నూతన మఠం నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. వేద పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గంగమ్మా..కరుణించమ్మా!

కురిచేడు: స్థానిక దొనకొండ రోడ్డులోని గంగమ్మ చెట్టు వద్ద ఆ ప్రాంత రైతులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం కూడా సగం అయిపోయినా ఇంతవరకు వరుణుడి జాడ కనిపించక పోవడంతో రైతులంతా అమ్మవారిని వేడుకున్నారు. ప్రత్యేకంగా ప్రభను నిర్మించి గ్రామోత్సవం చేశారు. అమ్మవారి చెట్టు వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పొంగళ్లు చేసి అమ్మవారికి నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. వరుణుడు కరుణ చూపి వర్షాలు కురిసి పంటలు సంమృద్ధిగా పండాలని, పశువులు, మనుషులు అందరూ సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు.

బోధనలో మెళకువలు అవసరం

పుల్లలచెరువు: పాఠశాలల్లో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులు, చేర్పులు, పాఠ్యాంశాల బోధనలో మెళకువలు, నూతన విద్యా విధానం వంటి వాటిపై ఉపాధ్యాయులకు పూర్తి అవగాహన కల్పించేందుకు స్కూల్ కాంప్లెక్సులు నిర్వహిస్తున్నామని, ఉపాధ్యాయులంతా దృష్టి పెట్టాలని, నిర్లక్ష్యంగా ఉండవద్దని జెడ్పీ హెచ్ఎం ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ స్కూల్లో గురువారం ప్రారంభమైన సబెక్టు స్కూల్ కాంప్లెక్సు సమావేశాలను పరిశీలించారు. ఉత్తమ ఫలితాల సాధనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తురిమెళ్లలో వైఎస్సార్ పొలంబడి

కంభం: మండలంలోని తురిమెళ్ల గ్రామంలో గురువారం వ్యవసాయాధికారులు డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరిపైరు సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వరిపైరుపై విపరీతంగా పురుగుమందులు పిచికారీ చేస్తే కలిగే దుష్ఫలితాలపై వ్యవసాయాధికారి డి.శ్వేత రైతులకు వివరించారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో మొత్తం 67 పనుల అజెండాలో 15 పనులకు ఆమోదం తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.84 కోట్లతో నగర పంచాయతీ పరిధిలోని సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, నీటి సప్లయి వంటి అభివృద్ధి పనుల గురించి ఆమోదం తెలిపినట్లు కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. కమిషనర్ వై.రామకృష్ణయ్య, వైస్ చైర్మన్లు ఆర్‌డీ రామకృష్ణ, కాతా దీపిక, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

వెలుగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలి

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం వెలుగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలని వివిధపార్టీల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం పట్టణంలోని ఎన్‌జీవో హోమ్‌లో సీపీఎం, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సోమయ్య మాట్లాడుతూ.. అక్టోబర్‌లో వెలుగొండ నీటిని ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు అందె నాసరయ్య, పి.సత్యనారాయణ, సుదర్శన్, షేక్ అబ్దుల్ రజాక్, భాను, జె.నాగయ్య, డీకేఎం రఫీ, రూబెన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ



సమస్యలను సభ దృష్టికి తెస్తున్న వైస్ చైర్మన్ ఇస్మాయిల్, కౌన్సిలర్ నగేష్

మార్కాపురం టౌన్: పట్టణంలో పారిశుధ్య కార్మికులు సరిగా పనిచేయడం లేదని మార్కాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, 27వ బ్లాక్ కౌన్సిలర్ క్శెట్టి నగేష్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీ కృష్ణ దృష్టికి తీసుకొచ్చారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం అమరజీవి పొట్టి శ్రీరాములు కౌన్సిల్ భవనంలో చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. పట్టణంలో పారిశుధ్య పనులను సక్రమంగా చేపట్టేవిధంగా సిబ్బందిని ఆదేశించాలని కౌన్సిలర్లు సభ దృష్టికి తెచ్చారు. పట్టణంలో రేషన్‌బియ్యం పంపిణీ సక్రమంగా జరగడంలేదని, డీలర్లు, రేషన్‌బియ్యం అందజేసే వాహనదారుల మధ్య విభేదాలు చోటుచేసుకోవడంతో ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ ప్రజలకు రేషన్ బియ్యం సక్రమంగా అందించడం లేదన్నారు. రానున్న రోజుల్లో వర్షా కాలం కారణంగా ప్రతి వార్డులో ఫాగింగ్, శానిటేషన్, చెత్త సేకరణ నిర్వహించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. పట్టణ శివారు ప్రాంతాల్లో పైపులైన్లు వేసి తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మున్సిపల్ చైర్మన్ స్పందిస్తూ.. సక్రమంగా విధులు నిర్వర్తించని పారిశుధ్య కార్మికులపై చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ పంపిణీపై తహసీల్దార్ శ్రీనివాసరెడ్డితో ఫోన్‌లో విషయం తెలుపగా రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించి ప్రజలకు రేషన్ బియ్యం సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారన్నారు. సమావేశంలో కమిషనర్ గిరికుమార్, ఏఈ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్, ఆర్‌ఐ మోహన్‌నాయక్, కౌన్సిలర్లు కొత్త కృష్ణ, సిరాజ్, ఎమ్ శ్రీనివాసులు, చంద్ర, షెక్షావలి, దారివేముల హర్షిత, రంగలక్ష్మి, ఫాతిమా, కరీమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

మాగుంట కుటుంబ సభ్యులకు ఘన స్వాగతం



ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాఘవరెడ్డిలకు స్వాగతం పలుకుతున్న నాయకులు

తాళ్లూరు (ముండ్లమూరు): ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఆయన కుమారుడు మాగుంట రాఘవరెడ్డికి తాళ్లూరు వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. గురువారం ఒంగోలుకు సమీపంలోని వల్లూరమ్మ ఆలయం వద్ద పూజలు చేసిన అనంతరం గజమాలలతో వారికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు ఐవీ సుబ్బారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కోటా రామిరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కుల రామకృష్ణ, నాయకులు ప్రభుదాసు, గువ్వల శ్రీనివాసులరెడ్డి, పులి కృష్ణారెడ్డి, తూము శివశంకరరెడ్డి, పులి బ్రహ్మారెడ్డి, కోటా వుంకటరామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, కై పు అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకుంటాం

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం రూరల్: మండలంలోని భూపతిపల్లి గ్రామంలో బుధవారం రాత్రి విద్యుదాఘాతంతో మృతిచెందిన వేశపోగు రాజ్‌కుమార్(23) మృతదేహాన్ని మార్కాపురం జిల్లా వైద్యశాలకు వెళ్లి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయాన్ని వెంటనే వచ్చేలా చర్యలు తీసుకుంటానని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. విద్యుత్ సీఎండీ, ఈఈలతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి 5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరగా వారు సమ్మతించారు. ఎమ్మెల్యే వెంట బొడిచర్ల సర్పంచ్ మున్నంగి కోటేశ్వరి, దళిత సంఘాల నాయకులు ఉన్నారు.

ఆలయాల్లో లక్ష బిల్వార్చన



త్రిపురాంతకేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

త్రిపురాంతకం: శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి, శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయాల్లో శ్రావణ పౌర్ణమి సందర్భంగా లక్ష బిల్వార్చన, నవ దాన్యార్చన ప్రత్యేక పూజలు చేశారు. త్రిపురాంతకం ఆలయాలు శ్రావణ పౌర్ణమి సందర్భంగా భక్తులతో కిక్కిరిశాయి. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేకంగా చండీ హోమం చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలను అర్చకులు ప్రసాద శర్మ, విశ్వనారాయణశాస్త్రి నిర్వహించగా ఆలయాల ఈఓ చెన్నకేశవరెడ్డి భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బీమా నమోదు ప్రారంభం



ఆముదాలపల్లిలో బీమా నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని ఆముదాలపల్లిలో గురువారం బీమా నమోదు కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పేరం సుభాష్‌చంద్రబోస్‌రెడ్డి ప్రారంభించారు. మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆదేశాల మేరకు సచివాలయ కన్వీనర్లుకు, గృహసారథులకు వైఎస్సార్ సీపీ తరఫున రూ.10 లక్షల బీమా నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. సర్పంచ్ శిరిమల్లి శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్లు రాములవీడు శ్రీను, కొత్తపులి బ్రహ్మారెడ్డి, గృహసారథులు నాయకులు పాల్గొన్నారు.

ఎస్సైని సన్మానించిన సర్పంచ్‌లు

కొనకనమిట్ల: మండల ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బ్రహ్మనాయుడిని గురువారం మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు మర్యాపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైకి అభినందనలు తెలిపి సన్మానించారు. సర్పంచ్‌లు పాతకోట వెంకటరెడ్డి, పార్లపల్లి సిద్దానబీ, పొలూరి లక్ష్మీసాంబ వెంకటేశ్వర్లు, బోయన వెంకటేశ్వర్లుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వాహకులకు లైసెన్స్ ఉండాలి

కొమరోలు: నర్సరీలు నిర్వహిస్తున్న నిర్వాహకులు తప్పనిసరిగా ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన లైసెన్సును కలిగి ఉండాలని గిద్దలూరు ఉద్యానవన శాఖాధికారి విష్ణుప్రియ సూచించారు. మండలంలోని తాటిచెర్లమోటు గ్రామ సమీపంలో నర్సరీలను ఆమె గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో విష్ణుప్రియ మాట్లాడుతూ నర్సరీలను నిర్వహించుకోవడం కోసం అనుమతి తీసుకోవాలని తెలిపారు.

అండర్ పాస్‌లో రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇప్పించాలి



ఎంపీ మాగుంటకు సమస్యను వివరిస్తున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

కురిచేడు: మండలంలోని కాటంవారిపల్లె గ్రామం వద్ద ఉన్న రైల్వే లైనుపై గేటు 250లో అండర్‌పాస్ నిర్మాణం జరిగింది. అండర్ పాస్‌లో రోడ్డు నిర్మాణం చేయక పోవడంతో పాటు నీరు వెళ్లేందుకు కాలువలు నిర్మాణం చేయక పోవటంతో వర్షాకాలం ఎక్కడికక్కడ మట్టి పేరుకుని రైతులు పొలాలు వెళ్లేందుకు నానాఇబ్బందులు పడుతున్నారు. ఆ అండర్‌పాస్ నుంచి రైతులు పొలాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అండర్ పాస్‌కు ఇరు వైపులా రోడ్డు లేకపోవటంతో ఇక్కట్లు పడుతున్నామని జెడ్పీటీసీ నుసుం వెంకటనాగిరెడ్డి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని గురువారం ఆయన నివాసంలో కలిసి సమస్యను వివరించారు. పనుల మంజూరుకు కృషి చేయాలని విన్నవించారు. అందుకు ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు జెడ్పీటీసీ తెలిపారు.

గర్భసంచికి శస్త్ర చికిత్స



శస్త్ర చికిత్సలో పాల్గొన్న వైద్యులు

కంభం: మూడేళ్లుగా అసాధారణ గర్భ రక్తస్రావంతో బాధపడుతున్న ఓ మహిళకు గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో శస్త్ర చికిత్స నిర్వహించినట్లు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శివనాయక్ తెలిపారు. కందులాపురం గ్రామానికి చెందిన పఠాన్ ఖాసింబీ అనే 40 ఏళ్ల మహిళ మూడేళ్లుగా ఈ సమస్యతో బాధపడుతూ మార్కాపురం, గుంటూరు అనేక వైద్యశాలల్లో చూపించుకుంటోంది. వ్యాధి నయం కాక పోవడంతో పదిహేను రోజుల క్రితం కంభం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చింది. గైనకాలజిస్టు వైద్యురాలు డాక్టర్ పద్మావతి బాయి ఆమెను పరీక్షించి ఆపరేషన్ చేసి గర్భసంచి తొలగిస్తే సమస్య పరిష్కారమవుతుందని తెలిపి అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం గురువారం ప్రభుత్వ వైద్యశాలలోనే ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. ఆపరేషన్‌లో అనస్తీషియా వైద్యుడు, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శివనాయక్, గైనకాలజిస్టు వైద్యురాలు డాక్టర్ పద్మావతిబాయి, డాక్టర్ ఆదాం, సిబ్బంది పాల్గొన్నారు. గతంలో ఎన్నడూ ఇటువంటి శస్త్ర చికిత్స చేయలేదని, తొలిసారిగా నిర్వహించిన శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేశామని సూపరింటెండెంట్ తెలిపారు. సర్జరీకి ప్రైవేటు వైద్యశాలలో సుమారు 70 నుంచి 80 వేల రుపాయలకు వరకు ఖర్చు అవుతుందని తెలిపారు.

సంఘాల బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీ వసుంధరాదేవి

ముండ్లమూరు: మహిళా సంఘాల బలోపేతానికి సిబ్బంది, మండల సమాఖ్య ప్రతినిధులు కృషి చేయాలని వైఎస్సార్ కేపీ దర్శి క్లస్టర్ ఏరియా కో ఆర్డినేటర్ వసుంధరాదేవి అన్నారు. స్థానిక ఆ సంస్థ కార్యాలయంలో గురువారం మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం మండల సమాఖ్య అధ్యక్షురాలు కుంటా పేరమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నందున వాటిని అర్హులకు అందించి వారి అభివృద్ధికి పాటుపడాలన్నారు. క్రమం తప్పకుండా గ్రామ సంఘ సమావేశాలు నిర్వహించి మహిళలకు పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. జగనన్న తోడు అర్హులకు అందేలా చూడాలన్నారు. వ్యాపారాల అభివృద్ధి కోసం బ్యాంకు రుణాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అమూల్ పాలకేంద్రాల నిర్వహణకు పాడిగేదెల కొనుగోలుకు రుణ సదుపాయం కల్పించాలన్నారు. కోరం లేని కారణంగా సమావేశాన్ని ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసినట్లు ఏపీఎం తెలిపారు. సమావేశంలో ఏపీఎం హనుమంతరావు, సిబ్బంది, గ్రామ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

468 మందికి వైద్య పరీక్షలు

గిద్దలూరు రూరల్: మండలంలోని కె.ఎస్.పల్లెలో డాక్టర్ బ్రహ్మానందరెడ్డి వైద్యశాల బృందం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో 468 మందికి వైద్య పరీక్షలు చేసింది. డాక్టర్ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ వైద్య పరీక్షల్లో కంటి సమస్య పరిష్కారం కోసం 72 మందికి ఆపరేషన్లు, చెవి, ముక్కు ఆపరేషన్ల కోసం 8 మంది, జనరల్ సర్జన్ 18 వంటి వివిధ రకాల వ్యాధులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తూ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆకట్టుకున్న విద్యార్థుల జి-20 సదస్సు



జి-20 సదస్సులో విద్యార్థులు

కంభం: మండలంలోని జంగంగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీ ఎన్‌జీసీ ఆధ్వర్యంలో గురువారం యువ మంతన్ కార్యక్రమం నిర్వహించారు. 9, 10 తరగతులు చదువుతున్న 20 మంది విద్యార్థులు జి-20 సదస్సులోని 20 దేశాల అధ్యక్షులుగా వ్యవహరిస్తూ ఆయా దేశాల్లోని భౌగోళిక స్వరూపాలు, ఆర్థిక స్థితిగతులను ఆవిష్కరించారు. వాతావరణ మార్పులు, వాటివలన కలిగే ప్రమాదాలు, నివారణోపాయాలపై చర్చించారు. విద్యార్థులు ఆయా దేశాల అధినాయకుల హావభావాలను అనుకరిస్తూ ఆయా దేశాల జాతీయ పతాకాలతో మాదిరి జి-20 సదస్సును వాస్తవం అనిపించేలా కళ్లకు కట్టారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గని వెంకటేశ్వర్లు, సైన్సు అధ్యాపకుడు పిచ్చిరెడ్డి మార్గదర్శకంలో నిర్వహించిన జి-20 మాదిరి సదస్సు ప్రపంచ దేశాల స్థితిగతులపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు కాంతారావు, సీఆర్పీ నాయక్, లక్ష్మి పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ సర్వే త్వరగా పూర్తి చేయాలి

పుల్లలచెరువు: గ్రామాల్లో బడిమానేసిన విద్యార్థులను గుర్తించడంపై చేస్తున్న సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎంఈవో-2 ఇందిర ప్రసాద్ అన్నారు. గురువారం పీపీపల్లి సచివాలయంలో జీఈఆర్ సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. సర్వేను త్వరగా పూర్తి చేయాలని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్, వలంటీర్లుకు సూచించారు. గ్రామాల్లో బడి మానేసిన విద్యార్థులు ఉండకూడదనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

రాచర్ల: మండలంలోని చినగానిపల్లెలో శుక్రవారం సాయంత్రం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యేలం మురళీకృష్ణ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు పాల్గొంటారని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అంకాళమ్మ తల్లికి పూజలు

కొనకనమిట్ల: సకాలంలో వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మండలంలోని గొట్లగట్టు గ్రామంలో గురువారం అంకాళమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి పూజలు నిర్వహించారు. అంకాలమ్మ దీవించమ్మా అంటూ గ్రామంలో మేళతాళాలతో ఉత్సవం నిర్వహించారు. గ్రామ సమీపంలోని కొండపై వెలసిన అంకాళమ్మ దగ్గర పూజలు నిర్వహించి ప్రజలందరూ సహపంక్తి భోజనాలు చేశారు.

ఎంఈఓ-1గా కాశయ్య

బేస్తవారిపేట: బేస్తవారిపేట ఎంఈఓ-1గా కొర్రా కాశయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కాశయ్య పదోన్నతిపై బేస్తవారిపేట మండల ఎంఈఓ-1గా బదిలీపై వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంఈఓను ఎంఈఓ-2 చేగిరెడ్డి రమణారెడ్డి, కార్యాలయ సిబ్బంది, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.

బత్తాయి రైతులకు శిక్షణ తరగతులు

అర్థవీడు (కంభం): మండలంలోని పెద్ద కందుకూరు, మోహిద్దీన్‌పురం గ్రామాల్లో గురువారం బత్తాయి రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఉద్యానవన శాఖ అధికారి డి.శ్వేత మాట్లాడుతూ ఉద్యానవన పంటలు సాగు చేసుకునే రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తూ అధికారుల సూచనల ప్రకారం సాగు చేసుకుంటే మంచి దిగుబడుల పొందొచ్చన్నారు. బత్తాయిలో చీడ పీడల నివారణలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో సాగుచేస్తున్న బత్తాయి తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో రిటైర్డ్ సైంటిస్ట్ నారాయణ, వ్యవసాయాధికారి మొహమ్మద్, రైతులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాల మేరకు మాజీ సర్పంచి ఆస్తులు జప్తు

గిద్దలూరు రూరల్: కోర్టు ఆదేశాల మేరకు మండలంలోని ఉయ్యాలవాడ మాజీ సర్పంచి గోపాలకృష్ణ ఆస్తులను గురువారం స్థానిక పోలీసుల సహకారంతో జప్తు చేసినట్లు రిటైర్డ్ డీఎస్పీ వెంకట నారాయణ తెలిపారు. రాచర్ల మండలం అక్కపల్లె గ్రామానికి చెందిన రిటైర్డ్ డీఎస్పీ డాక్టర్ కాంద్ర వెంకటనారాయణ వద్ద మాజీ సర్పంచి గోపాలకృష్ణ మూడేళ్ల క్రితం రూ.9.50 లక్షలు అప్పు చేసి తిరిగి చెల్లించని పక్షంలో కాంద్ర వెంకటనారాయణ గుంటూరు కోర్టును ఆశ్రయించారు. ఆ మేరకు గుంటూరు కోర్టు మాజీ సర్పంచికి సంబంధించిన పట్టణంలోని గణేష్‌నగర్‌లోని ఇల్లు, ఉయ్యాలవాడ గ్రామంలోని ఇల్లుని జప్తు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

తర్లుపాడు: అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని మండలంలోని తుమ్మలచెరువు గ్రామస్తులు కొందరు గురువారం రాత్రి సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

డాక్యుమెంట్ రైటర్ల సంక్షేమానికి కృషి

మార్కాపురం: మార్కాపురం ప్రాంత దస్తావేజు రైటర్ల సంక్షేమానికి కృషి చేస్తామని నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ హుస్సేన్, బూదాల మోహన్ తెలిపారు. గురువారం మార్కాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో డాక్యుమెంట్ రైటర్ల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పీవీ సుబ్బయ్య, జీసీహెచ్ రామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా టి.సుబ్బారావు, కార్యదర్శులుగా బూదాల మోహన్, శివయాదవ్, షేక్ మున్వర్, సహాయ కార్యదర్శులుగా ఎస్‌కే అస్లాంబాషా, ఎ.శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు. కోశాధికారులుగా కిరణ్, సీతా రామిరెడ్డిలతోపాటు గౌరవ సలహాదారులను కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

విశ్వశాంతి కోసం గాయత్రి యజ్ఞం

గిద్దలూరు రూరల్: విశ్వశాంతి కోసంగాయత్రి యజ్ఞం నిర్వహించినట్లు రామకృష్ణ ధ్యాన మందిరం నిర్వాహకులు పి.హనుమంతారెడ్డి అన్నారు. పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని కాశినాయన నగర్ గాయత్రిమాత ఆలయంలో గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో గురువారం గాయత్రి యజ్ఞం చేశారు. ఆయన మాట్లాడుతూ గాయత్రి యజ్ఞంతో సకల శుభాలు సంతరించుకుంటాయన్నారు.గాయత్రిమాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్‌నారాయణరెడ్డి,గాయత్రిపరివార్‌సభ్యులుపాల్గొన్నారు.